వ్యర్థాలకు నిప్పు.. పుడమికి ముప్పు

- పంట వ్యర్థాల దహనంతో అనర్థాలు
- భూమి నిస్సారంగా మారే ప్రమాదం
- కలియదున్ని మురగబెడితే పంటకు మేలు


పొలంలో పంట వ్యర్థాలను దహనం చేస్తున్న దృశ్యం

గణపవరం : రైతన్నకు తన పంట భూమిపై ఉండే మమకారం విడదీయలేనిది. అన్నదాత భూమిని అంతగా ఇష్టపడతాడు. పంట కోసిన వెంటనే మలిపంటకు భూసారం ఎలా పెంచాలన్నదానిపైనే రైతుల దృష్టి ఉండేది. పొలాల్లో పశువులను మందకట్టడం, పొలంలో మిగిలిపోయిన వరి గడ్డిని, వరి మోడులను మురగబెట్టి భూమిలో కలిసేలా కలియదున్నడం, ఇళ్ల వద్ద పేరుకుపోయిన పెంట కుప్పలను పొలాలకు తరలించడం వంటి చర్యల ద్వారా భూసారం పెంపునకు రైతులు ఎన్నో చర్యలు తీసుకునేవారు. ఇదంతా ఒకప్పటి మాట. మారుతున్న కాలంతో, యాంత్రీకరణ వ్యవసాయంతో రైతన్నల ఆలోచనలూ మారుతున్నాయి. గతంలోలా పొలాలలో మిగిలిపోయిన పంట వ్యర్థాలను, అవశేషాలను సేంద్రియ ఎరువుగా మార్చుకుని భూసారం పెంచి, మంచి దిగుబడి సాధించాలన్న ఆలోచన రైతుల్లో కొరవడింది. అంత శ్రమ, సమయాన్ని కేటాయించే తీరికలేక రైతులు పంట వ్యర్థాలను పొలాలలోనే తగలబెట్టేస్తున్నారు.

పుడమి తల్లికి హాని

ప్రస్తుతం దాళ్వా వరికోతలు, మాసూళ్లు పూర్తయిన సమయం కావడంతో ఏగ్రామంలో ఊరి బయటకు వెళ్తే పొలాలలో వ్యర్థాలు దగ్ధమవుతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దీనివల్ల పుడమికి హాని తలపెట్టడమే కాక, రైతులు పలు విధాలుగా నష్టపోతున్నారు. పంటకు రకరకాల తెగుళ్ల వ్యాపించడం, వాటి నివారణకు రసాయనాలు వినియోగించడం వల్ల పొలాలలో మిగిలిన వ్యర్థాలను తగలబెడితే గత పంటకాలపు తెగుళ్లకు కారణమైన బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి దుష్ప్రభావాలు నశించి, తదుపరి పంటకు వ్యాపించకుండా అరికట్టవచ్చనే భావన కూడా కొందరు రైతుల్లో ఉంది. కొందరు రైతులు వ్యర్థాలను కలియదున్ని, మురగదమ్ము చేయడానికి చాలా సమయం పడుతుందని, త్వరగా రెండో పంట వేయాలన్న ఆతృతతో పొలాలలోని పంటవ్యర్థాలను తగుల బెడుతున్నారు. అయితే ఈ ఆలోచనా విధానం పూర్తిగా తప్పని, దీని వల్ల లాభం లేకపోగా, నష్టం మాత్రం ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దహనం వల్ల ఎన్నో అనర్థాలు



పంట వ్యర్థాలను పొలంలోనే కాల్చివేయడం వల్ల పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, శిలీంధ్రాలు నశిస్తాయి. అలాగే పర్యావరణానికి హానిగా మారడమే కాక భూసారం తగ్గిపోతుంది. భూమి అధికంగా వేడెక్కడంతో కొన్ని సూక్ష్మ పోషకాలను కోల్పోతుంది. పంట అవశేషాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి పెనువిఘాతం కలుగుతుంది. అలాగే పంటలకు మేలు చేసే ఎరలు, ఇతర సూక్ష్మ క్రిములు పూర్తిగా నశిస్తాయి. తద్వారా భూమి నిస్సారం అవుతుంది. ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం ఉండదు.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం

వరి సాగులో సేంద్రియ పద్ధతులు పాటించాలి


పాతూరులో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: రైతులు వరి సాగులో సేంద్రియ పద్ధతిని అవలంబించాలని ఎస్‌ఎస్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కె రెడ్డి అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం గ్రామీణ అవగాహన, కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సును నిర్వహించారు. ఏఓ ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులగా అసోసియేట్ డీన్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి, ఏరువాక ఏలూరు సమన్వయకర్త కె.ఫణికుమార్, ఏడీఏ ఉషారాజకుమారి, శాస్త్రవేత్త నాగేంద్ర బాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పిస్తే సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాసుబాబును కలిసిన చిట్టూరి


వాసుబాబును సత్కరిస్తున్న నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు చిట్టూరి సాయికృష్ణ

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడిగా భీమడోలు మండలం పాతూరు గ్రామానికి చెందిన చిట్టూరి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠాన వర్గం నియామక ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా చిట్టూరి బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ఐటీ విభాగం పని చేయాలని, పార్టీ విధానాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల అధ్యక్షుడు సంకు సత్యకుమార్ పాల్గొన్నారు.

విజయ్‌కు అభినందనలు


విజయ్‌ను అభినందిస్తున్న బిషప్ పొలిమేర జయరావు

దెందులూరు: శిక్షణ పూర్తి చేసుకుని గురువుగా అభిషేకం పొందిన గోడి విజయకుమార్‌ను బుధవారం ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు ఆశీర్వదించారు. ఆర్‌సీఎం లక్ష్యాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక విద్య, వైద్య సేవ, మౌలిక వసతులు కల్పన రంగాల్లో విశిష్ట సేవలు అంజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పీ. బాల, వృద్ధుల ఆశ్రం చైర్మన్ విజయ్ తదితరులు ఉన్నారు.

వెల్‌నెస్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి


బాధితులను పరీక్షిస్తున్న డాక్టర్ రాకేష్

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలను గ్రామ శివారు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ తెలిపారు. బుధవారం సోమవరప్పాడు వెల్‌నెస్ సెంటరులో బాధితులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు, అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గణపవరం: రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త కార్మికసంఘాల సమ్మెను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పిలుపు ఇచ్చారు. బుధవారం గణపవరం మండలం కేశవరం,అప్పనపేట, మల్లపరాజు పేట తదితర గ్రామాలలో ఆయన కార్మికులతో కలసి బంద్ విజయవంతం చేయాలని ప్రదర్శనలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎం.పెంటారావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకుడు దిద్దే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై కళాజాత

దెందులూరు: ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వాటి నివారణ సమష్టి బాధ్యతని ప్రాజెక్ట్ మేనేజర్ శిరీష, మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏలూరు కీర్తన, కల్చరల్ సొసైటీ కళాకారులు అన్నారు. బుధవారం ఏలూరు ఎస్‌ఎంఆర్ నగర్ బ్రిడ్జ్ సమీపంలో వీధి నాటిక అవగాహన సమావేశం నిర్వహించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో ఏలూరు జిల్లా ఎడిషన్ నియంత్రణ విభాగం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అవగాహన సమావేశం వీధి నాటికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు ఐసీటీసీ సెంటర్లు ఏఆర్ మందులు పీపీటీసీ కేంద్రాలు మొబైల్ ఐసిటిసి కేంద్రాలు రక్తదానం ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంఎల్‌డీ సిబ్బంది వైద్య సిబ్బంది స్థానిక ఏఆర్ హెచ్‌డిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

వ్యాకుల మాత ఊరేగింపు

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో పరిస్థితి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వ్యాకుల మాత ప్రతిమతో డప్పు వాయిద్యాలతో ఆర్‌సీఎం సంఘ పెద్దలు సంఘస్తులు, యువత, చిన్నారులతో కలిసి గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జండా పేట, కొత్తపేట, శ్రీనివాసరావుపేట, రాజుల వీధి, గాంధీ నగర్, కొమ్మన వారి తోట వీధుల్లో గీతాలాపనలతో ర్యాలీ జరిగింది.

నీతి కథలపై విద్యార్థులకు అవగాహన


భీమడోలు: లైబ్రరీలో నీతికథలు వివరిస్తున్న రిసోర్స్‌పర్సన్లు


వేసవి విజ్ఞాన తరగతుల్లో శిక్షణ అందిస్తున్న రిసోర్స్ పర్సన్

భీమడోలు: నీతి కథలు జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు దోహద పడతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసంగా సాగుతున్నాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సామూహిక పుస్తక పఠనం, భగద్గీత శ్లోకాలను పఠించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో జాతీయ నాయకుల చరిత్రలు, యోగాసనాలను వేయించారు. అలాగే పూళ్లలోని శ్రీతోట వెంకట్రామయ్య మెమోరియల్ శాఖా గ్రంథాలయానికి బుధవారం పూళ్ల హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు రూ.4400 విలువ చేసే రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఆ ఫ్యాన్లను గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, రీడర్స్ ఫోరమ్ సభ్యులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటి సభ్యులు వీవీ ప్రభాకరరావు, రీడర్స్ ఫోరమ్ సభ్యులు కిషోర్, ప్రసాద్ పాల్గొన్నారు.


వేసవి శిక్షణలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో ఆటల పోటీలు

దెందులూరు: మండలంలో పోతునూరు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాంబాబు బుధవారం పాఠశాల విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో కోకో, కబడ్డీ, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏ రంగంలోనైనా ప్రణాళిక నిరంతర సాధన క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యపడతాయన్నారు. విజేతలకు శిక్షణ తరగతులు చివరి రోజున అతిథులతో బహుమతులు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

పెదపాడు: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపాలని పెదపాడు శాఖా గ్రంధాలయాధికారి డీ జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా రిసోర్స్‌పర్సన్ దత్తి రేణుక యల్లమ్మ విద్యార్థులకు బమ్మెర పోతన జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులకు కే రాజేశ్వరరావు రచించిన చిట్టి రాజు గూని గుర్రం కథను విద్యార్థులకు చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో ఆట ఆడే విధానాన్ని నేర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

భీమడోలు: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అమరావతి సెర్ప్ అడిషనల్ సీఈవో శ్రీరాములు నాయుడు అన్నారు. భీమడోలులో గ్రామ సంఘాల సభ్యులతో బుధవారం డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజుతో కలిసి ఆయన ముఖాముఖిగా చర్చించారు. మైక్రో క్రెడిట్ ప్లాన్‌పై సభ్యులకు అవగాహన కల్పించారు. వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సమాఖ్య కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి సంబంధిత సిబ్బంది పలు సూచనలందించారు. ఏపీఓ రత్నకుమారి, సిబ్బంది విజయదుర్గ, సావిత్రి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని బాదంపూడిలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ద్వారా బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. సర్పంచ్ కంకటాల పద్మలీల మాట్లాడుతూ మే 1 నుంచి పంచాయతీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ చలివేంద్రం ద్వారా బాటసారులతో పాటు, చిన్న తిరుపతి వెళ్తున్న కాలినడక భక్తుల దాహార్తిని తీర్చగలుగుతున్నామన్నారు. పంచాయతీ సెక్రటరీ గిరి పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి


విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: పది, ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్లస్ టు కళాశాల హెచ్‌ఎం మల్లికార్జున్ రావులు తెలిపారు. బుధవారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను ఆయన పర్యవేక్షించారు. గణిత ఉపాధ్యాయులు ఆశీర్వాదం నుఅడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఆయన వెంట పాఠశాల రికార్డు అసిస్టెంట్ గుళ్ళపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: విద్యుత్ మరమ్మతులు, నూతన లైన్‌లు నిర్మాణం నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఈఈ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కై కరం, రామన్నగూడెం, సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, కై కరం, తల్లాపురం, అప్పారావుపేట గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు


గుండుగొలనులో శ్రీవారికి పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముగింపు రోజు స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, పవళింపు సేవ, ద్వాదశ కోవెల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో పూజారులు స్వామి, అమ్మవార్లను విశేషంగా పువ్వులతో అలంకరించి ముస్తాబు చేశారు. వారిని 12 సార్లు పల్లకిలో ద్వాదశ కోవెల ప్రదక్షణలు జరిపించారు. పుష్ప ఉత్సవం, పవళింపు సేవలు కన్నుల వేడుకగా సాగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, పెద్దలు నీలంశెట్టి రాంబాబు, మండిగ వీర్రాజు, మద్దుల శేఖర్, మద్దుల బ్రహ్మం పాల్గొన్నారు.

మాలలు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

గణపవరం: కూటమి పాలనలో మాలలకు జరుగుతున్న అన్యాయాలపై ఐక్యపోరాటానికి మాలలంతా సిద్ధంగా ఉండాలని మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పరలో మాలమహానాడు మండల శాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమాజంలో కుల వివక్ష రూపుమాపడానికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు సుప్రీంకోర్టు తీర్పు విఘాతం కలిగించేలా ఉందన్నారు. సరైన జనాభాలెక్కలు లేకుండా, అభివృద్ధి చెందిన వివరాలు లేకుండా హడావుడిగా చేసిన వర్గీకరణ సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సబ్బితి రాజు, వెన్నపు చంటి, చోడదాసి జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఏఎంసీ చైర్మన్‌గా రామసీత

దెందులూరు : దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గారపాటి రామసీత నియమితులయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్, 18 మంది సభ్యులను నియమించారు.ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గౌరవ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా అల్లు జ్యోతి, మెంబర్లుగా బాలిన కుమారి, చందు రంగజావని, దొరరాజు భ్రమరాంబ కుమారి, గారపాటి రామకృష్ణ, మద్దల దయానందరాజు, మాతే కుసుమకుమారి, పసుపులేటి శ్రీరామభార్గవ కృష్ణ, పెదపూడి వెంకట సుజాత లక్ష్మి, పుసులూరి బాల వెంకట సత్యవరప్రసాద్, వైవాక సత్యనారాయణ, దరిబోయిన సత్యనారాయణ, షేక్ మౌలాలి, మచ్చారావు శ్రీనివాసరావులను ఎన్నికయ్యారు. ఈ కమిటీ సంవత్సరం పాటు అధికారంలో ఉంటుందన్నారు.

రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలి

దెందులూరు: మండలంలోని రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలి దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి డీ.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గ్రామంలో మట్టి పరీక్షలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో మట్టి నమూ నా పరీక్షలు చేయించుకోవాలన్నారు. నేల స్వభావ పోషక విలువలు తెలుసుకోలేనందుకు మట్టి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. రైతుల వ్యవసాయ భూమి ఆర్థికఅభివృద్ధి భద్రత లక్ష్యంగా వ్యవసాయ శాఖ చేస్తున్న మట్టి నమూనా పరీక్షలు కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వెంట విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగేంద్ర ఉన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు


విజయరాయిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘ నేతలు

పెదవేగి : ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి పిలుపునిచ్చారు. పెదవేగి మండలం విజయరాయిలోని ఉపాధి కార్మికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. వేతన బకాయిలు ఇవ్వకపోవడం నిధులు తగ్గించడం పనిముట్లు ఇవ్వకపోవడం వంద రోజులు పనులు కల్పించకపోవడం తదితర రూపాల్లో పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఉపాధి కార్మికులకు 200 రోజులు పనిదినాలు కావాలని సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని , రూ.600 వందలు వేతనాలు ఇవ్వాలని అడిగిన వారందరికీ జాబ్ కార్డ్, పని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు అస్కర అప్పలస్వామి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.శ్యామల రాణి, వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ నాయకులు రౌతు ఎల్లమ్మ, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు

వీడని ప్లాస్టిక్ భూతం

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- అవగాహన కల్పించడంలో విఫలం
- పట్టించుకోని అధికారులు


ఇళ్ల మధ్య ఉన్న మురుగునీటి నిల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు


కవర్లలో సామాన్లు తీసుకువెళ్తున్న దృశ్యం

పెదవేగి : ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రతిబంధకంగా మారాయి. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు మానవాళి మనుగడను ప్రశ్నిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషధించాలని అధికారులు సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసినా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం మాత్రం విచ్చలవిడిగా కొనసాగుతుంది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ రోజు మాత్రమే స్వచ్ఛభారత్..ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీలు, నిర్వహిస్తున్న అధికారులు, యంత్రాంగం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించడానికి అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదు. డ్వాక్రా మహిళల ద్వారా మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాలోకి తెచ్చి ఓ వైపు ప్లాస్టిక్ నిషేధంతో పాటు మరోవైపు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను యంత్రాంగం నేటికీ అమలు చేయడం లేదు. నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించే వారు. కొంత కాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలు పెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక్ కవర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకొని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా వాటి వినియోగమే కాదు. రీసైక్లింగ్ కూడా జరుగుతోంది. వీటి వినియోగం పర్యావరణానికి చాలా ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం

ఈ మధ్యనే మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీ శాఖ చర్యలు చేపట్టింది. అయినా గ్రామాల్లో ఏ దుకాణం చూసినా ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్త కుప్ప, మురుగుకాలువను చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు కవర్లు లేవంటున్నారు. వినియోగదారులు వస్తువులు వదిలి వెళ్లిపోతుంటే కవరు ఇస్తున్నారు. కవర్లు లేకపోతే తమకు వ్యాపారం జరగడంలేదని, వినియోగదారులు ఏ విధమైన సంచులు తీసుకురాకుండా వచ్చి వెళ్లిపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ఆరు నెలలుగా 30 నుంచి 40 శాతం వరకూ ఇవే ఉంటున్నాయి. ఏ చెత్తకుప్ప చూసినా, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే నిషేధం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.